సాక్షి
గుంటూరు
గురువారం, 24, జూలై, 2025



దుర్గమ్మకు ఆషాఢ సారె

తాడేపల్లి రూరల్ : మంగళగిరి దుర్గానగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్, అనిత దంపతులు ఆషాఢ సారెను సమర్పించారు.



వర్మీ కంపోస్టు యార్డు పరిశీలన

తెనాలి టౌన్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డును బుధవారం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ముప్పా యేసుబాబు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఘనంగా బోనాల పండుగ

రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడులో బుధవారం ముత్యాలమ్మకి మహిళలు బోనాలు సమర్పించారు. వానలు కురవాలని ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

నేడు ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవాన్ని కృష్ణా జిల్లా గన్నవరం మండలం ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఉప కులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఆమె వివరాలు వెల్లడించారు. విశ్వవిద్యాలయ గౌరవ కులపతి, గవర్నర్ ఎస్. అబ్దుల్‌నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. పూర్వ విద్యార్థి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పంజాబ్ గవర్నమెంట్, డైరెక్టర్ పవర్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఏ. వేణు ప్రసాద్ పాల్గొంటారని ఆమె తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచినవారికి స్నాతకోత్సవంలో పురస్కారాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఇంటి సిలిండర్లు వ్యాపారానికి వాడితే చర్యలు




గుంటూరు వెస్ట్: గృహ అవసరాలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్లను వ్యాపారాలకు వాడితే చర్యలు తప్పవని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి ఆర్.చంద్రముని తెలిపారు. గత రెండు రోజులుగా నగరంలో 20 రెస్టారెంట్లు, టిఫిన్ బండ్లపై సిబ్బందితో దాడులు చేసినట్లు చెప్పారు. ఇందులో 147 డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపారాలకు ఉపయోగిస్తునట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని 30 మందిపై 6–ఏ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇక నుంచి తరచూ తనిఖీలు చేస్తామని ఆయన వెల్లడించారు.

వైభవంగా శాకంబరీ దేవి ఉత్సవాలు



తెనాలి: స్థానిక గాంధీ చౌక్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో బుధవారం శాకంబరీ దేవి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో హరి ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు జంపని నాగ భాస్కర్ ఉత్సవాలను వైభవోపేతంగా జరిపారు. అమ్మవారిని వివిధ కూరగాయలతో విశేషంగా అలంకరించారు.అర్చకులు పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవో హరిప్రసాద్ మాట్లాడుతూ ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆలయంలో శాకంబరీ దేవి ఉత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడి పంటలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు తాళాబత్తుల ఉదయ్‌శంకర్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా దుర్గమ్మ



తాడేపల్లి రూరల్: మంగళగిరి పెదకోనేరులోని శ్రీ దుర్గా భవాని ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం శాకంబరీ దేవి అలంకారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు కూర్మాల బాలసాయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కూర్మాల దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజులు పాటు అమ్మవారికి అలంకార ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలి రోజు అమ్మవారిని కూరగాయలతో శోభాయమానంగా అలంకరించామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారని ఆయన పేర్కొన్నారు. శ్రావణ మాసం ప్రారంభం రోజు పూలతో అలంకరించి పూజలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

బ్రేక్‌లు లేని అవినీతి!

దోపిడీకి కాదేది అనర్హం అనే చందంగా రవాణాశాఖ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ముడుపులు తీసుకుని నిబంధనలకు నీళ్లు వదిలేస్తున్నారు. కళ్ల ముందే కనికట్టు జరుగుతున్నా, కాసుల వర్షంలో అన్నీ కొట్టుకుపోతున్నాయి. ఇసుక దందాలో జిల్లా ఉన్నతాధికారి మొదలుకొని, హోంగార్డు వరకు తిలా పాపం తలా పిడికెడు అన్నట్లు బెదిరింపుల పర్వానికి దిగి దోచుకుతింటున్నారు.

- రవాణా శాఖలో అక్రమ వసూళ్లు
- నిబంధనలు గాలికి వదిలేసిన అధికారులు, సిబ్బంది
- లారీ చాసిస్‌లు పెరిగినా తనిఖీలు నో
- ఇష్టానుసారంగా పైసా వసూల్
- ఇసుక లారీల నుంచి అధికారులకు రూ. 18వేలు, సిబ్బందికి రూ. 2వేలు



ఆర్టీఏ అధికారులు వేధింపులపై లారీ డ్రైవర్ల ఆందోళన (ఫైల్)

పట్నంబజారు: గుంటూరు జిల్లా కేంద్రంగా స్వర్ణభారతీనగర్‌లో రవాణాశాఖ (ఆర్టీఏ) కార్యాలయం నడుస్తోంది. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు (ఎఫ్‌సీ), లైసెన్స్ మంజూరు ప్రక్రియ ప్రైవేట్ పరం కావడంతో సిబ్బంది మామూళ్లకు బ్రేక్ పడింది. దీంతో ఆర్టీఏ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరుతో రోడ్లపై తిష్టవేసి నయాదందాకు తెరలేపారు. ఇసుక, కంకర, డస్ట్ అధికలోడులకు అనుమతులు లేకపోవడం తదితర వాటిని ఆసరాగా చేసుకుని అక్రమ వసూలుకు పాల్పడుతున్నారు.

ఎంచుకున్న ప్రాంతాలపై దాడి

గుంటూరు నగరంలోని చుట్టుగుంట సెంటర్, కాకాని వై.జంక్షన్, బుడంపాడు బైపాస్, మంగళగిరి టోల్‌గేట్ ప్లాజా, ఏటుకూరు రోడ్డు, అమరావతి రోడ్డు, ఇన్నర్‌రింగు రోడ్డు, గోరంట్ల వంటి ప్రాంతాలను ఎంచుకుని టాస్క్‌ఫోర్స్ బృందాలు తిష్ట వేస్తాయి. ఈ ప్రాంతాల్లో నిత్యం 1000 నుంచి 1500 వరకు లారీ, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తాయి. వీటితో పాటు అంతర్రాష్ట్ర పర్మిట్లు, అనుమతులు, వే బిల్లులు, అక్రమ రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. భౌతికంగా అధికారులు ఒక్క రూపాయి కూడా తీసుకునేందుకు వీల్లేదు. దీంతో నిబంధనలు పాటించని వాహనాలకు జరిమానాలు విధించి సీజ్ చేయడం మానేసి పైసా వసూల్‌కు పాల్పడుతున్నారు.

రోడ్డెక్కిన లారీ యజమానులు

ఇసుక, కంకర, గ్రానైట్, ఎర్రమట్టి తరలించే లారీలకు సంబంధించి రూ. 18 వేలు అధికారులకు, సిబ్బందికి రూ. 2వేలు మామూళ్లు ఇస్తున్నట్లు లారీ యజమానుల అసోసియేషన్ నేతలు కొన్నాళ్ల కిందట స్పష్టంగా చెప్పారు. రవాణాశాఖ అధికారుల వేధింపులు భరించలేక పోతున్నామని రోడ్డెక్కి ఆందోళన చేసిన పరిస్థితులు కూడా ఉన్నాయి. ప్రతి నెలా 500పైగా లారీలకు రూ. 20వేల చొప్పున నెలవారీ మామూళ్లు ఇస్తున్నా కూడా అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారంటూ లారీ యజమానులు మండిపడ్డారు.

రాంబంటు కనుసన్నల్లో దందా

ఆర్టీఏ కార్యాలయంలో పలు పనుల నిమిత్తం హోంగార్డులను పోలీసు శాఖ నుంచి తీసుకుంటారు. ఈ క్రమంలో కొంత మంది అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారు. మరీ ముఖ్యంగా తాను రవాణా శాఖ కార్యాలయంలో ఒక అధికారికి '' రాంబంటునని'' చెప్పుకుంటూ ఓ హోంగార్డు దందాలు చేస్తున్నాడు. అతని అక్రమ వసూళ్లపై సాటి ఉద్యోగులు సైతం భయపడే పరిస్థితి ఏర్పడింది. లక్షలాది రూపాయలకు పడగలెత్తాడనే ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల జరిగిన బదిలీల్లో సైతం అతడిని అధికారులు పంపలేదని ఆ శాఖలోనే గుసగుసలు విన్పిస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు



ఐదు నుంచి ఎనిమిది అడుగులు పెరిగిన లారీ చాసీస్

జిల్లాలో 300 నుంచి 350 వరకు లారీలు చాసీస్ వైశాల్యాన్ని పెంచుకుని తిరుగుతున్నా రవాణా అధికారులు పట్టించుకోవడం లేదు. కంపెనీ ఇచ్చిన బాడీని ఆటోనగర్‌లో రీమోడల్ చేయించి వాహనాల చాసీస్‌ను పెంచేస్తున్నారు. వీటిని వదిలేయడానికి రవాణా శాఖ అధికారులు నెలకు రూ. 25వేల వరకు తీసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇసుక, చాసీస్ లారీల యజమానులు ప్రతి నెలా 5వ తేదీ కల్లా నెలవారీలు తెచ్చివ్వకుంటే, కచ్చితంగా అధికారుల తనిఖీలు మాత్రం ప్రారంభమవుతాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అవినీతికి పాల్పడితే చర్యలు



రవాణశాఖ అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇసుక లారీలపై ఎటువంటి కేసులు నమోదు చేయడం లేదు. చాసీస్ పెంచిన లారీలపై దృష్టి సారిస్తాం. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే నేరుగా నా దృష్టికి తీసుకురావాలి.

–కె. సీతారామిరెడ్డి (డీటీసీ, గుంటూరు జిల్లా)

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్




నగరంలో బైక్‌పై పర్యటిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): నగరంలో శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ పరిస్థితిని సమీక్షించేందుకు బుధవారం ఆయన ద్విచక్ర వాహనంపై కంకర గుంట అండర్ పాస్, బ్రాడీపేట, లక్ష్మీపురం, లాడ్జి సెంటర్, శంకర్‌విలాస్ సెంటర్, మూడు వంతెనలు, కొత్తపేట, నాజ్ సెంటర్, ఉమెన్స్ కళాశాల రోడ్డులో పర్యటించారు. ఎస్పీ మాట్లాడుతూ మూడు వంతెనలు, అండర్‌పాస్ వద్ద వర్షపు నీరు నిలవకుండా కార్పొరేషన్ కమిషనర్‌తో చర్చించి మోటార్ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అమరావతి వైపు నుంచి వచ్చే హెవీ వాహనాలను లాడ్జి సెంటర్, లక్ష్మీపురం, కంకరగుంట బ్రిడ్జి మార్గంలో అనుమతించాలని అధికారులను ఆదేశించారు. కొన్ని హెవీ వాహనాలు లాడ్జీ సెంటర్, శ్రీనగర్, మూడు వంతెనల మీదుగా డైవర్షన్ చేయాలని, మిగిలిన వాహనాలను శంకర్‌విలాస్ బ్రిడ్జి మీదుగా అనుమతించాలని తెలిపారు. ట్రాఫిక్ డైవర్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బోర్డులు, చిత్ర పటాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రజల కూడా పోలీసులకు ఆయన కోరారు. ఆయన వెంట ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, వెస్ట్ డీఎస్పీ అరవింద్, ట్రాఫిక్ సీఐలు ఏ. అశోక్, సింగయ్య, అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు, ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొన్నారు.

టెండర్ బెదిరింపులు

- మేమే వేస్తాం..మిగిలిన వారు వేయొద్దు !
- వాట్సాప్ గ్రూపుల్లో మేసేజ్‌లు పెడుతున్న పచ్చ కాంట్రాక్టర్లు
- ఎవరైనా వేస్తే నగరపాలక సంస్థ కార్యాలయానికి పిలిపించి బెదిరింపులు



కాంట్రాక్టు మిత్రులకు సమాచారం
ఈ కింద తెలియజేయబడిన వర్క్
అబ్లికాయిషన్ పార్టీ నాయకులు
చేసుకోదల్చున్నారు కాబట్టి ఎవరు ఈ వర్క్
తాలూకు బిడ్ లో పాల్గొనకూడదని
తెలియజేస్తున్నాను
Tender ID 829456
ET No.27/2025-26 Item No.20
Providing WMM from Agatavarapadu
Sai Baba Temple road to Auto Nagar
Railway Gate in Div No.57 under
AE-12 Section (LB Nagar)
Rs.₹ 36,81,666 22/07/2025 15:05

Tender ID 825219
ET NO.22/2025-26 ITEM NO-1
Providing Wet mix Road at Pragathi
Nagar and at road beside of AC
godown at Etukuru IN DIV NO :16
UNDER AE-15 SECTION
Rs.₹ 19,73,550 22/07/2025 15:05

వాట్సాప్ గ్రూపులో పెట్టిన మెసేజ్ స్క్రీన్ షాట్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పచ్చ నేతల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా ఉంది. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే ప్రతి పని తమకే కావాలని పట్టుబడుతున్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన వారే టెండర్లల్లో పాల్గొంటారని, ఎవరైనా కాదని పాల్గొంటే వారిని బెదిరించడం పరిపాటిగా మారింది. మాట వినని వారిని నగరపాలక సంస్థ కార్యాలయానికి పిలిచి మేయర్ దగ్గర లేదా ఇంజినీరింగ్ అధికారుల దగ్గర పంచాయితీ పెట్టి బెదిరిస్తున్నారు. బిల్లులు ప్రాసెస్ కాకుండా చేస్తామని చెబుతుండటంతో కాంట్రాక్టర్లు చేసేదేమి లేక పాలకులు, అధికారులు చెప్పినట్లుగా టెండర్ల నుంచి తప్పుకుంటున్నారు.

బహిరంగంగా బెదిరింపులు

గుంటూరు నగర పరిధిలోని ఏఈ 12 పరిధిలో ఆగతవరప్పాడు సాయిబాబా టెంపుల్ వద్ద రూ.36,81,666లక్షలతో, ఏఈ 15 పరిధిలో ప్రగతీనగర్ వద్ద రూ.19,73,550 లక్షలతో వర్కులకు పార్టీ అబ్లిగేషన్ కింద టీడీపీ నాయకులు టెండర్ వేయాలనుకుంటున్నారు. మిగిలిన వారు బిడ్‌లో పాల్గొనకూడదంటూ టీడీపీకి చెందిన ఓ పచ్చ కాంట్రాక్టర్ వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టాడు. ఎవరైనా టెండర్‌లో పాల్గొంటే బిల్లులు ప్రాసెస్ కానివ్వమంటూ పేర్కొన్నాడు. తమపై పచ్చ కాంట్రాక్టర్లు బహిరంగంగా బెదిరింపులకు దిగుతున్నట్లు తోటి కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్కుల్లో నాణ్యత లోపం

గుంటూరు నగరంలో గత నెలలో 269 వర్కులకు టెండర్లు పిలిచారు. వీటిల్లో మెజార్టీ వాటిని టీడీపీకి చెందిన పచ్చ కాంట్రాక్టర్లే దక్కించుకున్నారు. సకాలంలో వర్కులు మొదలు పెడతారా ? అంటే అది లేదు. వర్కు ప్రారంభించినా మెటీరియల్‌లో నాణ్యతకు పాతర వేస్తున్నారు. అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇందుకు నిదర్శనం మంగళవారం గుంటూరు నగరం దేవాపురం 4వ లైనులో పీకలవాగుపై తూతూమంత్రంగా నిర్మిస్తున్న కల్వర్టు అద్దం పడుతుంది. అది ఒక్కసారి కుప్పకూలి అక్కడ పనిచేస్తున్న ఓ కార్మికుడు మృతి చెందాడు. అధికారులు పచ్చ కాంట్రాక్టర్లకు ఏ విధంగా సపోర్ట్ చేస్తున్నారో ఈ సంఘటన చూస్తే స్పష్టంగా అర్థం అవుతుంది. ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోతే కార్మిక చట్టాల ప్రకారం రూ. 12 లక్షలను కాంట్రాక్టర్ చెల్లించాలి. అధికారులు, మేయర్ చర్చల పేరుతో కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే కార్మికుడి మృతి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అంబటి, నూరిఫాతిమా, బాలవజ్రబాబు తదితరులు

పట్నంబజారు: కార్పొరేషన్ కమిషనర్, అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో దేవాపురంలోని పీకల వాగు కల్వర్టు పనుల జరుగుతున్న చోట గోరంట్లకు చెందిన తోట అప్పారావు అనే రోజువారీ కూలీ మృతి చెందటం బాధాకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దేవాపురం పీకలవాగు వద్ద కల్వర్టు నాణ్యత లోపంతో కూలిపోయిన పరిస్థితుల్లో కార్మికుడు తోట అప్పారావు (58) మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం సంఘటన స్థలాన్ని అంబటి, పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబుతో పాటు పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి పూర్తిగా సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. పలుమార్లు కాంట్రాక్టర్‌కు ఒక పక్క కల్వర్టు వాలిపోతోందని తెలియజేసినా కిందట కర్రలు పెట్టి పనులు చేయించారని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ పీకల వాగుపై రూ. 9 లక్షల వ్యయంతో నిర్మాణం చేస్తున్న కల్వర్టు నాణ్యత లోపంతో కూలిపోయిందని ఆరోపించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌కు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ప్రపోజల్ పెట్టిన ప్లాన్‌ను కూటమి నేతలు, నగరపాలక సంస్థ అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై మార్చేశారని ధ్వజమెత్తారు. కల్వర్టు స్లాబ్ నిర్మాణానికి ఇనుము కూడా తక్కువ వాడినట్లు తెలుస్తోందని స్పష్టం చేశారు. నగర కమిషనర్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు కాంట్రాక్టర్ వద్ద పర్సంటేజ్‌లు తీసుకుంటూ నాణ్యతను గాలికి వదిలేశారని ఆరోపించారు.

సాక్షిలో స్పష్టంగా రాశారు

నగరంలో అనేకచోట్ల నాణ్యత లేకుండా నిర్మాణ పనులు జరుగుతున్నట్లు సాక్షి పత్రికలో ఘటన జరిగిన ముందు రోజే వార్త వచ్చిందని, దీన్ని ప్రతి ఒక్కరూ చదవాలని అంబటి రాంబాబు తెలిపారు. తక్షణమే కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన రోజువారీ కూలీ అప్పారావు కుటుంబానికి కాంట్రాక్టర్‌తో పాటు సీఎం రిలీఫ్ ఫండ్, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఆర్థిక సహాయం అందజేయాలని రాంబాబు కోరారు. స్థానిక కార్పొరేటర్ బూసి రాజలత మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, నందేటి రాజేష్, పఠాన్ సైదాఖాన్, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, దానం వినోద్, కార్పొరేటర్ గోపి శ్రీనివాస్, పార్టీ అనుబంధ విభాగాల నేతలు, జిల్లా, నగర కమిటీ నేతలు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం



బాధితుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): కల్వర్ట్ కూలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన తోట అప్పారావు కుటుంబానికి అండగా ఉంటామని మేయర్ కోవెలమూడి రవీంద్ర హామీ ఇచ్చారు. బుధవారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును కాంట్రాక్టర్ చేతుల మీదుగా అందించారు. మృతునికి ముగ్గురు ఆడపిల్లలున్నారని, వారు తమ జీవన భృతికి రైతు బజార్‌లో షాపు కావాలని అడుగుతున్నారని, మంజూరు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఫోర్జరీ పత్రాలతో స్థలం కబ్జాకు కుట్ర

- చనిపోయిన మహిళ స్థానంలో మరొకరితో రిజిస్ట్రేషన్
- బాధితుల ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసిన నల్లపాడు పోలీసులు

గుంటూరు రూరల్: చనిపోయిన మనిషి స్థానంలో మరొకరి పేరుతో ఫోర్జరీ పత్రాలు సృష్టించి స్థలం రిజిస్ట్రేషన్ చేయించిన ఘటనలో బుధవారం నల్లపాడు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం .. గుంటూరు జిల్లా గోరంట్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి పద్మజ, వెంకట శ్రీనివాస్ దంపతులకు గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలో 1.83 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి కొత్తపల్లి పద్మజ పేరుతో రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ క్రమంలో ఆమె అనారోగ్య కారణాలతో కొంత కాలం కిందట మృతి చెందింది. విషయం తెలిసిన అదే ప్రాంతానికి చెందిన చింతారెడ్డి మహేశ్వర్ రెడ్డితో పాటు పలువురి కన్ను ఆ భూమిపై పడింది. మహేశ్వర్‌రెడ్డి గ్యాంగ్ పద్మజ స్థానంలో మరో మహిళను ఏర్పాటు చేసుకుని ఆమె పేరుతో ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలను సృష్టించి భూమిని కాజేసేందుకు కుట్ర పన్నారు. అనుకున్నదే తడవుగా ఆ భూమిని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నగరంలోని ఒక రిజిస్ట్రార్‌ను సంప్రదించారు. పద్మజ మరణించిన ఏడాది తరువాత నకిలీ పత్రాలతో ఆ భూమిని మహేశ్వర్‌రెడ్డి గ్యాంగ్ రిజిస్ట్రేషన్ చేయించుకుంది. అనంతరం భూమి తమదని పాగా వేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలిసిన కొత్తపల్లి పద్మజ భర్త వెంకట శ్రీనివాస్ తన వద్ద పత్రాలు కూడా ఉన్నాయని తెలిపినా ఆయన్ను బెదిరించి ఆ భూమి తమదని చెప్పి పంపారు. దీంతో తనకు న్యాయం చేయాలని వెంకట శ్రీనివాస్ నల్లపాడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. దర్యాప్తులో మహేశ్వర్‌రెడ్డి గ్యాంగ్ చేసింది మోసమేనని తేలడంతో బుధవారం అరెస్ట్ చేసి కోర్టుకు అప్పగించారు. అతనితో పాటు మిగిలిన వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

శ్రావణ మాసంలో భ్రమరాంబకు విశేష అలంకరణలు



పెదకాకాని: స్థానిక శివాలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని మొదటి శుక్రవారం భ్రమరాంబ అమ్మవారిని పలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. శ్రావణ మాసమంతా శుక్రవారాల్లో అమ్మవారు పసుపు కొమ్ములు, గాజుల అలంకరణ, చీరల అలంకరణలో దర్శనమిస్తారని ఆయన పేర్కొన్నారు. భక్తులంతా శ్రీ భమరాంబ మల్లేశ్వర స్వామిని దర్శించుకొని కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు. భక్తులందరికీ స్వామివారి తీర్థ, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	51,954
అమ్మకాలు	50,048
నిల్వ	9,222

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,500
నంబరు-5	10,000-13,500
341	10,000-13,600
4884	10,000-12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,000
బాడిగ-355	10,000 - 12,600
దేవనూరు డీలక్స్	10,000 - 12,500
ఆర్మూర్	9,600 - 11,000
తాలుకాయలు	5,000 - 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,800
బాడిగ - 355	10,000-12,500
దేవనూరు డీలక్స్	10,000 - 12,600
తాలు	5,200 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)

28న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 28న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఎస్.తానయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలోని సీసీఎల్ లిమిటెడ్, కృష్ణాజిల్లా పెద అవుటపల్లిలోని హైటెక్ ప్రింట్ సిస్టమ్స్ లిమిటెడ్, ఒంగోలులోని ఈఎస్ఐసీ బ్రాంచ్ కార్యాలయం, విజయవాడలోని ఈఎస్ఐసీ బ్రాంచ్ కార్యాలయం, నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల, బాపట్ల జిల్లా నందిరాజుతోటలోని ప్రకాష్‌నగర్ గ్రామసిరిలో నిధి ఆప్‌కే నికత్ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులంతా పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

పేదల అభ్యున్నతికి పాటుపడాలి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



వ్యాపారులు, పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: సమాజంలో అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం ఆర్థికంగా వృద్ధి చెందిన వారు ముందుకు వచ్చి వారిని దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలను అభివృద్ధి చేసేందుకు పీ-4 పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా మార్చి నుంచి నిర్వహించిన సర్వేలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో 1.20 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. గ్రామ సభల ద్వారా వారిని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్దలతో చర్చించి అర్హత ఉన్నవారందరినీ జాబితాలో చేర్చామని తెలిపారు. సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్నవారు వ్యక్తిగతంగా, సంస్థల పరంగా బంగారు కుటుంబాలను దత్తతకు తీసుకుని సహకారం అందించాలని ఆమె కోరారు. బంగారు కుటుంబాల్లోని పిల్లల విద్యా అవసరాలు, చిరు వ్యాపారులను ప్రోత్సహించడానికి మెంటార్‌గా, ఇతర అంశాల్లోనూ మార్గదర్శులు సహాయం అందించాలని తెలిపారు. ప్రభుత్వ విజన్- 2047 స్వర్ణాంధ్ర సాధన దిశగా అడుగులు వేయాలంటే పీ-4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో సీపీఓ శేషశ్రీ , ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

జ్వరాల ఆస్పత్రిలో పాముల సంచారం


జ్వరాల ఆస్పత్రిలో పాములను కొట్టి చంపిన సిబ్బంది

గుంటూరు మెడికల్ : గోరంట్లలోని ప్రభుత్వ ఛాతీ, సాంక్రమిత వ్యాధుల ఆస్పత్రి(జ్వరాల ఆస్పత్రి)లో పాములు సంచారంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి రెండు పాములను చంపగా, బుధవారం మరొకటి వంటగదిలో ప్రత్యక్షమైంది. వాస్తవానికి ఆస్పత్రి శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పరిశుభ్రంగా ఉంచి పాములు, ఇతర క్రిమికీటకాలు లోపలకు రాకుండా చర్యలు తీసుకోవాలి. అయితే, కాంట్రాక్టర్ పట్టించుకున్న దాఖలా లేదు. పాములు వార్డుల్లోకి వచ్చిన తరువాత అయినా బుధవారం ఆస్పత్రి అంతా స్పెషల్ డ్రైవ్ చేసి, పరిశుభ్రం చేయకపోవడంతో మరలా పెద్దపాము ఏకంగా కిచెన్‌లోకి ప్రవేశించి, సిబ్బంది గుండె ఆగిపోయేంత పని చేసింది. ఆస్పత్రిలో పాముల సంచారం గురించి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకంటి రఘును సాక్షి వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు. పాములు రాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

లక్ష్మీపురం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏ.వి. నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాత గుంటూరులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో బుధవారం భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ముందుగా యూనియన్ జెండాను సంఘం రాష్ట్ర కార్యదర్శి రమణారావు, సీఐటీయూ జెండాను వి. ఉమామహేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 లోపు సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే ఎమ్మెల్యేలను ఎక్కడికి అక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినప్పటికీ ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను చైతన్యంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పలు తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి. నరసింహారావు మహాసభల నివేదికను ప్రతినిధుల ముందు చర్చకు పెట్టారు. కార్యక్రమంలో వర్కింగ్ ఉమెన్ రాష్ట్ర నాయకురాలు దయా రమాదేవి తదితరులు ప్రసంగించారు.

ఘాట్ రోడ్ మూసివేత

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని కొండపై ఉన్న గండాలయ స్వామివారి దేవస్థానానికి వెళ్లే ఘాట్‌రోడ్‌ను మూసివేస్తున్నట్లు బుధవారం నరసింహస్వామి భక్తబృందం ఒక ప్రకటనలో పేర్కొంది. వర్షాలు అధికంగా రావడంతో ఘాట్‌రోడ్‌లో కొండరాళ్లు జారి పడుతున్నాయని.. నేడు అమావాస్య కావడంతో ఎక్కువ మంది భక్తులు గండాలయ స్వామి దేవస్థానానికి వస్తారని.. ఘాట్‌రోడ్‌లో రాకుండా మెట్ల మార్గంలో రావాలని వారు ఆ ప్రకటనలో సూచించారు.

రేపు జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: దిశ డాన్ బాస్కో సేవా విభాగ ఆధ్వర్యంలో ఈనెల 25న విద్యానగర్‌లోని డాన్‌బాస్కో ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పి.జీవన్, ప్రిన్సిపాల్ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఫ్యూచర్ ప్రాపర్టీ, ఇన్నో సోర్స్, కేప్‌స్టన్, మెడ్‌ప్లస్, అపోలో ఫార్మసీ, పేటీఎం, శ్రీరామ్ ఫైనాన్స్, హీరో మోటోకార్ప్, ఫోర్ట్ మేనేజ్‌మెంట్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెన్త్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేకుండా నేరుగా హాజరుకావచ్చునని ఆయన సూచించారు. ఇతర వివరాలకు 79811 72216, 82972 42547, 80730 31426 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

12 మండలాల్లో మోస్తరు వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో 12 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా తుళ్లూరు మండలంలో 42.4 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 1.6 మి.మీ. కురిసింది. సగటున 9.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తాడికొండ మండలంలో 31.4 మి.మీ., పెదకాకాని 30.4, దుగ్గిరాల 16.8, మంగళగిరి 16.2, తాడేపల్లి 9.6, కొల్లిపర 7.2, మేడికొండూరు 5.6, గుంటూరు పశ్చిమ 3.2, గుంటూరు తూర్పు 2.6, తెనాలి మండలంలో 2.2 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూలై 23వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 122.4 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 197.8 మి.మీ. నమోదైంది.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



రెంటచింతల: మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం ఓ కౌలు రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన బి.నరసింహారావు (38) పదేళ్ల నుంచి రామిరెడ్డి పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరలో కరెంట్ మీటర్ బోర్డు పని చేస్తుండగా, విద్యుత్ తీగ తగిలి నరసింహారావు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ముగ్గురు ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్టు పల్నాడుజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి. సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. విశాఖలో ఈనెల 19, 20 తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాటర్ పోలో ఎంపిక పోటీలో ఆర్.హర్షవర్ధన్‌రాజు, వై.మధుకిషోర్, కె.శివసాకేత్ ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. బెంగుళూరులో ఆగస్ట్ 4 నుంచి 8వతేదీ వరకు జరగనున్న 51వ జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలో వాటర్ పోలో క్రీడలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అలాగే విశాఖలో నిర్వహించిన పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో జీఎస్ఎస్ నిత్య 50 మీటర్లు ఫ్రీ స్టైల్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. క్రీడాకారులను కోచ్ జి.సురేష్, సుబ్బారెడ్డి అభినందించారు.

రైలు కిందపడి యువతి బలవన్మరణం

సత్తెనపల్లి: రైలు పట్టాలపై యువతి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి రైల్వే గేట్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. బెల్లంకొండ మండలం గంగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు గత కొన్ని నెలలుగా వెన్నాదేవిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. భార్య సోదరి వెన్నదేవిలోని వారి ఇంటికి వచ్చింది. కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం రాత్రి విజయవాడ నుంచి లింగంపల్లి వెళ్లే రైలు వస్తుండగా 20 ఏళ్ల యువతి పట్టాలపై నిల్చుని బలవన్మరణానికి పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

షిర్డీ నుంచి గుంటూరు వెళ్తుండగా ప్రమాదం


ధ్వంసం అయిన డివైడర్

నరసరావుపేట టౌన్: ప్రయాణికులతో వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. నిత్యం రద్దీగా ఉండే గడియార స్తంభం సెంటర్‌లో ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పినట్లు అయింది. పోలీసుల కథనం ప్రకారం.. షిర్డీలో ప్రయాణికులను ఎక్కించుకొన్న మారుతి సుధాశ్రీ ట్రావెల్స్‌కు చెందిన బస్సు గుంటూరుకు బయలు దేరింది. మార్గమధ్యంలో తెల్లవారుజామున నరసరావుపేట గడియార స్తంభం వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న లారీని క్రాస్ చేసే క్రమంలో అదుపుతప్పి బస్సు డివైడర్‌ను ఢీకొంది. సంఘటనలో ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. ప్రమాదంతో ట్రాఫిక్ నిలిచి పోయింది. సమాచారం అందుకున్న సీఐ లోకనాథం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

హత్యాయత్నం కేసులో నిందితునికి జైలు

రేపల్లె: ఓ వ్యక్తిని కత్తితో హత్య చేయడానికి ప్రయత్నించిన కేసులో నిందితుడికి ఆరు సంవత్సరాల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల బుధవారం తీర్పు వెలవరించారు. పట్టణానికి చెందిన ఆర్‌కే జ్యూయలర్స్ నిర్వాహకుడు జక్కం రామకృష్ణ భార్యపై పట్టణానికి చెందిన పడకల వెంకటేశ్వరరావు 2017 సెప్టెంబర్ 11న అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపణలు వచ్చాయి. దీనిపై జక్కం రామకృష్ణ నిలదీశారు. వెంకటేశ్వరరావు చాకుతో రామకృష్ణపై దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. బాధితుడి ఫిర్యాదుతో రేపల్లె ఎస్ఐ బాలనాగిరెడ్డి కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనగాని శ్రీనివాసమూర్తి వాదించారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చినగంజాం-ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్ల మధ్య దిగువలైన్‌లో చోటుచేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొమడయ్య బుధవారం తెలిపారు. మృతుని వయస్సు 30 సంవత్సరాలు ఉంటాయని, 5.5 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ రంగు కలిగి ఉన్నాడని తెలిపారు. మృతుని కుడి రిబ్స్‌పై ఒక నల్లని పుట్టుమచ్చ, ఎడమ భుజంపై ఒక నల్లని పుట్టుమచ్చ ఉందన్నారు. మృతుని శరీరంపై నలుపు రంగు గడులు కలిగిన ఫుల్‌హ్యాండ్ షర్ట్, వెలిసిపోయిన బ్లూ జీన్స్ ప్యాంట్ ఉందని, ఎడమచేయి ఉంగరం వేలుకు తాబేలు బొమ్మ ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9440627646 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

పరిహారం చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలి

శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ బాధితుల డిమాండ్


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో భవనాలు కోల్పోతున్న యజమానులకు హైకోర్టు ఆదేశాల మేరకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారాన్ని చెల్లించిన తరువాతే పనులు ప్రారంభించాలని బ్రాడీపేట-అరండల్‌పేట షాప్ ఓనర్స్ అండ్ కీపర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శంకర్ విలాస్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే బ్రిడ్జి పనులు చేపట్టాలని హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ, అధికార యంత్రాంగం పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. ఆర్వోబీ నిర్మాణంతో భవనాలు కోల్పోతున్న 58 మంది యజమానులకు నష్టపరిహారాన్ని ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఈ విధంగా దాదాపు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల మేరకు చెల్లించాల్సిన నష్టపరిహారంతో పాటు ఆర్వోబీ నిర్మాణ వ్యయం రూ.98 కోట్లను కలుపుకుంటే మెగా ఫ్లైఓవర్ నిర్మించవచ్చునని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ పక్కన పెట్టిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం హడావుడిగా పిల్లర్స్ నిర్మాణ పనులను చేపట్టారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన వర్క్ ఆర్డర్‌లోనే బ్రిడ్జి నిర్మాణానికి ముందుగానే రోడ్డు విస్తరణ పనులు, కాలువల నిర్మాణం, విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్ పూర్తి చేయాల్సి ఉందని, అధికారులు ఇవేవీ చేయలేదని విమర్శించారు. అధికారులు ఏకపక్ష వైఖరితో ముందుకు వెళితే కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని స్పష్టం చేశారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే డిజైన్ ప్రకారం హిందూ కళాశాల కూడలి నుంచి లాడ్జి సెంటర్ వరకు మెగా ఫ్లైఓవర్‌ను, సింగిల్ పిల్లర్‌తో పాటు ఆర్‌యూబీలను ఏర్పాటు చేయడం ద్వారా వాహనాలు సులభంగా ప్రయాణిస్తాయని తెలిపారు. 70 ఏళ్లుగా అభివృద్ధి చెందిన శంకర్ విలాస్ సెంటర్ ఉనికి దెబ్బతినకుండా ఉంటుందని చెప్పారు. ఎర్త్ వాల్‌తో కూడిన ప్రస్తుత డిజైన్ ద్వారా బ్రిడ్జిని నిర్మించడం ద్వారా ఈ ప్రాంతం పూర్తిగా నిర్వీర్యం అవుతుందని అభిప్రాయపడ్డారు. అసోసియేషన్ నాయకుడు జి.కార్తిక్ మాట్లాడుతూ తాము బ్రిడ్జి నిర్మాణానికి, అభివృద్ధికి వ్యతిరేకం కాదని తెలిపారు. పరిహారం కింద బాండ్లు ఇస్తే తీసుకోబోమని, 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని కోర్టుకు వెళ్లగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. కోర్టు తీర్పును అమలు చేయాలని ఆయన కోరారు. దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదని, అధికారుల స్పందనను బట్టి తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

సర్పంచి నాగమల్లేశ్వరరావుకు పరామర్శ


నాగమల్లేశ్వరరావుతో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి గుంటూరు రమేష్ హాస్పిటల్లో గత 20 రోజులుగా చికిత్స పొందుతూ కోలుకున్న మన్నవ గ్రామ సర్పంచి బొనిగల నాగమల్లేశ్వరరావును బుధవారం వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయ కర్త అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సోదరుడు బొనిగల అమరేంద్రప్రసాద్ తదితరులు సర్పంచిని పరామర్శించారు.

రెంటపాళ్లలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ నేతల దాడి


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడితో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్తెనపల్లి: మిరప నారు దిబ్బల పైకి గొర్రెల మందను వదలడమే కాకుండా వైఎస్సార్ సీపీ శ్రేణులపై సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో టీడీపీ సానుభూతిపరులు మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా రెంటపాళ్ల గ్రామానికి చెందిన వల్లెపు రాంబాబు, వల్లెపు రవితేజ, వల్లెపు వీరయ్య మిరప నారు దిబ్బలు సాగు చేస్తుండగా టీడీపీ సానుభూతి పరులైన నంబుల కాటంరాజు, యాగంటి బాబురావు, సైదయ్యలకు చెందిన గొర్రెల మంద పడటంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కోపోద్రిక్తులైన కాటంరాజు, బాబురావు, సైదయ్యలు దాడి చేయడంతో వల్లెపు రాంబాబు, వల్లెపు రవితేజ, వల్లెపు వీరయ్యలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ప్రతిగా టీడీపీ సానుభూతిపరులు కూడా ఫిర్యాదు చేశారు. గాయపడి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వైఎస్సార్ సీపీ నాయకులు కొర్లకుంట వెంకటేశ్వర్లు, కొమ్మెర శివశంకర్, కొమెర వీరాంజి, మారిశెట్టి వెంకట్రావు, వల్లెపు సహదేవుడు, గంగిలి ఏసోబు, చల్లా వెంకటేశ్వర్లు తదితరులు పరామర్శించారు.

నోటీసులు ఇచ్చిన గంటకే డీలర్ సస్పెన్షన్

- కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న అధికారులు
- లింగంగుంట్ల రేషన్ డీలర్ యెండ్లూరి ఉదయలక్ష్మి ఆవేదన

పెదకూరపాడు : కూటమి ప్రభుత్వం అధికారులను అడ్డుపెట్టుకొని తనపై, కుటుంబ సభ్యులపై కక్ష సాధింపులకు పాల్పడుతుందని లింగంగుంట్ల గ్రామానికి చెందిన 18వ నంబరు రేషన్ షాప్ నిర్వాహకురాలు యెండ్లూరి ఉదయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం లింగంగుంట్ల గ్రామంలో తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనిఖీలు చేసిన గంటకు అధికారులు నోటీసులు ఇచ్చి తమ షాపులో ఉన్న రేషన్ స్టాకును వేరే షాప్‌కు తరలించారన్నారు. ఇంట్లో తాము లేని సమయంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు వచ్చి దురుసుగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ స్వలాభం కోసం తనపై, కుటుంబంపై దుష్ప్రచారం చేసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

సివిల్ సప్లయి డెప్యూటీ తహసీల్దార్ వివరణ

ఈ విషయమై సివిల్ సప్లయి డెప్యూటీ తహసీల్దార్ చీమలను వివరణ కోరగా ఈనెల 9న మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో శ్రీ విఘ్నేశ్వర స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 18వ రేషన్ షాపును తనిఖీ చేయగా నిల్వల కన్నా అధికంగా 125 కేజీలు బియ్యం, ఐదు కేజీలు పంచదార ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీనిపై 6-ఏ నమోదు చేసి ఆర్డీవోకు రిపోర్ట్ చేశామని తెలిపారు. ఈనెల 21వ తేదీన ఆర్డీవో షాపును సస్పెండ్ చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చామన్నారు. మిగిలిన స్టాకును స్వాధీనం చేసుకునేందుకు వెళ్ళగా రేషన్ షాపు నిర్వాహకులు సహకరించకపోవడంతో పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

అందుబాటులో 1,681 మెట్రిక్ టన్నుల ఎరువులు


మాట్లాడుతున్న ఏడీఏ రవిబాబు, పక్కన ఏఓ సుబ్బారెడ్డి

సత్తెనపల్లి: ఖరీఫ్ సాగుకు సత్తెనపల్లి పట్టణ, గ్రామీణ పరిధిలోని దుకాణాల్లో 1,681 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో గల గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణ, గ్రామీణ పరిధిలోని ఎరువుల దుకాణాల్లో యూరియా-590 మెట్రిక్ టన్నులు, డీఏపీ- 327 మెట్రిక్ టన్నులు, పొటాష్ ఎరువులు -95 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు-585 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ-84 మెట్రిక్ టన్నులు నిల్వలు అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులందరూ తమ గ్రామాల పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద, ప్రైవేట్ ఎరువుల దుకాణాలు వద్ద నుంచి ఎరువులను పొందవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో హతమార్చి నంద్యాల డోర్ డెలివరీ!

- మృతదేహాన్ని కారులో తీసుకువచ్చి భర్త ఇంటి వద్ద విడిచిపెట్టిన భార్య
- హత్యకు సహకరించిన తమ్ముడు


మృతుడు రమణయ్య

నంద్యాల: భర్తను తమ్ముడితో కలిసి చంపేసి.. ఆపై మృతదేహాన్ని కారులో తీసుకువచ్చి నంద్యాలలోని భర్త ఇంటి వద్ద విడిచిపెట్టింది ఓ మహిళ. నంద్యాల టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాలలోని నూనెపల్లెకు చెందిన రమణయ్య (50)కు పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన రమణమ్మతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి జ్యోతి, చందన, సాయి సంతానం. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా భార్య కొంతకాలంగా పుట్టిల్లు అయిన పిడుగురాళ్లలో ఉంటోంది. ఈ క్రమంలో భార్యతో మాట్లాడి ఇంటికి తీసుకొని రావడానికి రమణయ్య పిడుగురాళ్లకు సోమవారం రాత్రి వెళ్లాడు. అక్కడ భార్య బంధువులు, రమణయ్య మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రమణమ్మ, ఆమె తమ్ముడు రామయ్య కలిసి, రమణయ్య కంట్లో కారం చల్లి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం తమ్ముడితో కలిసి భర్త మృతదేహాన్ని కారులో నంద్యాలలోని ఆయన ఇంటి వద్దకు తీసుకువచ్చి, అక్కడ పడేసి పరారయ్యారు. మృతుడి ముఖంపై కారంపొడి ఉండటం.. తల, వీపుపై గాయాలు ఉండటంతో రమణయ్య కుమార్తెలు జ్యోతి, చందన నంద్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసులు నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పిడుగురాళ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.